సత్కారం



మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరైన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్.. – కుత్బుల్లాపూర్

పారిశుద్ధ్య కార్మికులకు కిట్ల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు కిట్లను అందజేస్తున్న బైరి భాస్కర్‌గౌడ్

సుభాష్‌నగర్: మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు బైరి భాస్కర్‌గౌడ్ తన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం పారిశుద్ధ్య కార్మికుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారికి కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా బైరి భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ తాను విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివని, అందుకే వారి సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు జరుపున్నట్లు తెలిపారు.

మంజీరా నీళ్లు వృథా..

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్ ఎదుట ప్రధాన రహదారిపై మంజీరా వాటర్ పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరు వృథాగా పోతోంది. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లీకేజీ కారణంగా నీరు రోడ్డు మీదుగా ప్రవహించి చత్రపతి శివాజీ పార్క్ వరకు వెళ్తున్నట్లు వారు పేర్కొన్నారు. గంటల తరబడి నీరు వృథా అవుతున్న సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.



పైప్‌లైన్ పగిలిపోవడంతో వృథాగా పోతున్న మంజీరా నీళ్లు

మృత్యు శకటాలు

నెత్తురోడుతున్న రహదారులు..!

- శాపంగా మారిన రోడ్డు విస్తరణ పనులు
- వాహనదారుల నిర్లక్ష్యం.. అతివేగానికి నిండు ప్రాణాలు బలి
- రోడ్డున పడుతున్న బాధిత కుటుంబాలు

దుండిగల్: రహదారులు నెత్తురోడుతున్నాయి. మితిమీరిన వేగం, మద్యం తాగి వాహనాలు నడపడం, రాత్రి సమయాల్లో రోడ్డు పక్కనే వాహనాలను పార్కింగ్ చేయడం, రోడ్డు పనులను మధ్యలోనే వదిలేయడం.. ఇలా కారణాలు ఏవైనా క్షణాల్లో ప్రమాదాలు జరిగి బాధిత కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపుతున్నాయి. ఇటీవలి కాలంలో దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాలే ఇందుకు అద్దం పడుతున్నాయి.

నిలిచిన రోడ్డు విస్తరణ పనులు

బాచుపల్లి రెడ్డీస్ ల్యాబ్ నుంచి గండిమైసమ్మ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణతో పాటు డివైడర్లు ఏర్పాటు చేసేందుకు 2012లో రూ.15 కోట్లతో ఆర్ అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. అయితే భౌరంపేట ప్రధాన రోడ్డులోని ఇందిరమ్మ విగ్రహం సమీపంలో 1.5 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డుకిరువైపులా అటవీ శాఖ భూమి ఉండడంతో పనులకు బ్రేక్ పడింది. దీంతో ఆ రోడ్డు ఇరుగ్గా ఉండడంతో అటు బాచుపల్లి.. ఇటు గండిమైసమ్మ నుంచి వేగంగా వచ్చే వాహనాలు భౌరంపేట వరకు వచ్చేసరికి నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గండిమైసమ్మ చౌరస్తా నుంచి బహదూర్‌పల్లి వరకు రోడ్డు విస్తరించి డివైడర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా కోర్టులో వివాదం కారణంగా శ్రీరామ్‌నగర్ గడ్డ వరకే రహదారి వెడల్పు చేసి వదిలేశారు. దీంతో రోడ్డు ఇరుకుగా ఉండడంతో పాటు మూల మలుపు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాద ఘటనలు ఇవీ..

◆ నిజాంపేట్‌కు చెందిన చంద్రప్రకాశ్ మేడ్చల్‌లో మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. గత నెల 24న తన బైక్‌పై ఇంటికి వస్తుండగా భౌరంపేట కేఎల్ యూనివర్సిటీ సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

◆ జూన్ 27న భౌరంపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని తన కుమారుడిని స్కూల్‌లో దింపేందుకు స్కూటీపై వెళ్తుంది. మల్లంపేటలోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద రెడీమిక్స్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో చిన్నారి లారీ చక్రాల కింద పడి మృతి చెందాడు.

◆ రాజేంద్రనగర్‌కు చెందిన ఐటీ ఉద్యోగులు భాను ప్రకాశ్, నళినికంత బిస్వాల్ పటాన్‌చెరు నుంచి మల్లంపేట వైపు కారులో వేగంగా వస్తున్న క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇరువురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.

నిబంధనల ఉల్లంఘన..

◆ దుండిగల్ పరిసర ప్రాంతాలైన ఖాజిపల్లి, బొల్లారం పారిశ్రామికవాడల్లో వంద సంఖ్యలో పరిశ్రమలు ఉండటంతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ప్రమాదాలు..

సంవత్సరం	మొత్తం కేసులు	మరణాల సంఖ్య	క్షతగాత్రులు
2020	134	49	89
2021	153	44	118
2022	119	42	82
2023	115	38	77
2024	113	41	72
2025 (ఇప్పటి వరకు)	99	22	59



ప్రమాదానికి కారణమైన భారీ వాహనాలు (ఫైల్)

◆ అయితే నో ఎంట్రీ సమయాల్లో భారీ వాహనాలను రోడ్డుకిరువైపులా నిలుపుతున్నారు. అసలే రోడ్లు ఇరుకుగా ఉండడంతో పాటు ప్రధాన రోడ్డు వెంట లైట్లు లేకపోవడంతో పార్క్ చేసిన వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

మద్యం మత్తులో డ్రైవింగ్..

◆ ఇటీవల జరిగిన ప్రమాదాల్లో అధికంగా మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే జరిగాయని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. దుండిగల్ లా అండ్ ఆర్డర్ పోలీసులు నాకా బందీ నిర్వహిస్తుండగా జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు ఆయా ప్రాంతాల్లో బారీకేడ్లను ఏర్పాటు చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయినా ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



ప్రమాదాల నివారణకు చర్యలు ..



ట్రాఫిక్, మున్సిపల్, ఆర్ అండ్‌బీ అధికారుల సమన్వయంతో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. గతంతో పోల్చితే ప్రమాదాల సంఖ్య తగ్గింది. గుర్తు తెలియని వాహనాలు ఢీకొట్టిన ఘటనలో వాహనాలను గుర్తించడం ఇబ్బందిగా మారింది. దీంతో ప్రధాన రోడ్లు అయిన బహదూర్‌పల్లి, గండిమైసమ్మ, గాగిల్లాపూర్ చౌరస్తా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. తరచూ వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

–సతీశ్, దుండిగల్ సీఐ

ప్రమాద కేంద్రాలను గుర్తించాం..



గతంలో బహదూర్‌పల్లి నుంచి దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు వరకు ప్రమాదాలు ఎక్కువగా జరిగేవి. అక్కడ డివైడర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాం. గండిమైసమ్మ నుంచి బాచుపల్లి వరకు ఉన్న రోడ్డులో సైతం బారీకేడ్లను ఏర్పాటు చేశాం. టీ జంక్షన్లు ఉన్న వాటిని మూసేసి యూటర్న్‌లు క్లోజ్ చేశాం. దీంతో గల్లీల నుంచి వచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ఉంటారు. అలాగే నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తూ పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– డి.శ్రీనివాస్, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ

ఫిట్‌నెస్ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్ల పంపిణీ



కుత్బుల్లాపూర్: కొంపల్లి సమీపంలోని వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో డ్రీమ్ ఫిట్‌నెస్ జిమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాడీ ఫిట్‌నెస్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. మూడు రోజులుగు కొనసాగుతున్న పోటీల్లో దాదాపు 130 మంది యువకులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా డ్రీమ్ ఫిట్‌నెస్ జిమ్‌ల మేనేజ్‌మెంట్ హెడ్ ప్రవీణ్ గోపాల్, హెడ్ కోచ్ చైతన్య, హెడ్ ట్రైనర్ ఉదయ్ మాట్లాడుతూ తమ జిమ్ ద్వారా యువత ఫిట్‌నెస్, ఆరోగ్య పరిరక్షణకు శిక్షణ ఇస్తున్నామన్నారు. డ్రీమ్ ఫిట్‌నెస్ జిమ్‌లో శిక్షణ పొందిన పలువురు యువకులు ఫిట్‌నెస్, వెయిట్ లిఫ్టర్లుగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. త్వరలో అన్ని వయసుల వారికి డ్రీమ్ ఫిట్‌నెస్ జిమ్ ఆధ్వర్యంలో మారథాన్, ఇతర అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చదువు ఆవశ్యకతను గుర్తించాలి

జగద్గిరిగుట్ట : తల్లిదండ్రులు విద్య ఆవశ్యకతను తెలుసుకోవాలని ఐ ఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన అంగన్‌వాడీ టీచర్లు, మాజీ కౌన్సిలర్ వరమ్మతో కలిసి డివిజన్ పరిధిలో ఇంటింటికి వెళ్లి పిల్లలను పాఠశాలకు బడికి పంపాలని కోరారు. ఈ సందర్భంగా చదువుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చదువుతోనే విజ్ఞానం వస్తుందని ప్రతి ఒక్కరికీ విద్య అందించాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియమించి పేదలకు నాణ్యమైన ఉచిత విద్య అందిస్తున్నారన్నారు, ప్రతి ఒక్కరూ చదువుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో రేవంత్ రెడ్డి యువసేన సాయి ప్రవీణ్ గౌడ్, గణేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థుల తల్లి దండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఐలయ్య గౌడ్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: 11కేవీ బాలాజీ హాస్పిటల్ ఫీడర్ లైన్ బ్యూటిఫికేషన్ పనుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ సబ్‌స్టేషన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు గంగా ఎన్‌క్లేవ్, ఎన్‌సీఎల్ కాలనీల్లో సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

పనిచేయని టైమర్లు.. ఆరని దీపాలు



చింతల్ మార్కెట్ రోడ్డులో వెలుగుతున్న వీధి దీపాలు..

రంగారెడ్డినగర్: వీధి దీపాలకు అమర్చిన టైమర్లు పనిచేయకపోవడంతో రాత్రి, పగలు తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి.. ఆదివారం మధ్యాహ్నం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఆదర్శ్‌నగర్, చింతల్ మార్కెట్ రోడ్లలో వీధి దీపాలు వెలుగుతూ కనిపించాయి. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వెలగాల్సిన దీపాలు ఇలా నిరాటంకంగా వెలుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం



పోచమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: గాజులరామారం డివిజన్ ఆదర్శ్‌నగర్‌లోని శ్రీపోచమ్మ ఆలయ 15వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. మహిళలు బోనాలతో పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యే వివేకానంద్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి సాగర్‌రావు, సభ్యులు కృష్ణ, చారి, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, నాయకులు కస్తూరి బాల్‌రాజ్, తెలంగాణ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన..

సుభాష్‌నగర్: సూరారం విశ్వకర్మ కాలనీలో ఆదివారం మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో బీపీ, డయాబెటిస్, గైనిక్, పీడియాట్రిక్ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 60 మంది చిన్నపిల్లలు, 150 మంది స్త్రీ, పురుషులకు ఉచిత కన్సల్టేషన్ నిర్వహించి మందులు అందజేశారు. అవసరమైన వారికి హెల్త్ కార్డు అందజేసి ఉచితంగా చికిత్స, ఆపరేషన్లు నిర్వహిస్తామని మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి వైద్యులు తెలిపారు.



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

జోరుగా గణేశ్ విగ్రహాల విక్రయాలు

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్‌లో గణేశ్ విగ్రహాల సందడి నెలకొంది. బుధవారం నుంచి గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలో గణనాథుల విగ్రహాల విక్రయాలు జోరందుకున్నాయి. చౌరస్తాలో నాలుగు వైపులా చిన్నపాటి విగ్రహాలు మొదలుకుని 10 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను అమ్మకానికి ఉంచారు. సైజును బట్టి రూ.300 మొదలుకుని రూ.16 వేల వరకు గణనాథుల విగ్రహాలను విక్రయిస్తున్నారు..



వినాయక విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతూ..





కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో విక్రయానికి ఉంచిన గణనాథులు..



విగ్రహాలను బేరమాడుతున్న కొనుగోలుదారులు..

యథేచ్ఛగా తోడేస్తున్నారు.!

- ఫాక్స్‌సాగర్ నీటిని బయటకు తోడుతున్న అధికారులు
- చెరువు కింద చేపట్టబోయే నిర్మాణాల కోసమే అంటున్న స్థానికులు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించినా కానరాని మార్పు

జీడిమెట్ల: ఫాక్స్‌సాగర్ చెరువులో నీటిని ఇరిగేషన్ అధికారులు విచ్చలవిడిగా బయటకు తోడేస్తున్నారు. ఆగస్టులో అత్యధికంగా వర్షాలు కురిసినప్పటికీ ఫాక్స్‌సాగర్‌లో మాత్రం నీటి స్టోరేజ్ అంతంత మాత్రంగానే ఉంది. ఇంత వర్షపాతం నమోదైనప్పటికీ చెరువు మాత్రం నీరు సరిగా లేక వెలవెలబోతోంది. చెరువులోకి వచ్చిన నీటిని ఇరిగేషన్ అధికారులు కాలువ ద్వారా విచ్చలవిడిగా బయటకు పంపిస్తున్నారు. చెరువు నీరు కాస్తా మురుగునీరు కాలువలో కలిసి వృధాగా పోతుండటంతో అధికారులు నీటిని ఎందుకు తోడేస్తున్నారని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఫాక్స్‌సాగర్ చెరువు చరిత్రలో ఇరిగేషన్ అధికారులు ఎప్పుడు ఇంత దారుణంగా ప్రవర్తించలేదని జీడిమెట్ల ప్రజలు అంటున్నారు.

నీటిని ఎందుకోసం తోడేస్తున్నారో?..

ఫాక్స్‌సాగర్ చెరువులో ఉన్న నీటిని అధికారులు ఎవరి ప్రయోజనం కోసం బయటకు తోడేస్తున్నారో అధికారులే జవాబు చెప్పాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఫాక్స్‌సాగర్ చెరువు స్థలంలో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా అయ్యాయి. దీనికి తోడు ఎఫ్‌టీఎల్ స్థలంలో చాలా వరకు నిర్మాణాలు చకచకా జరిగిపోయాయి. ఇవన్నీ అక్రమ కట్టడాలు ఇరిగేషన్ అధికారుల కనుసన్నల్లోనే జరిగినా ఇరిగేషన్ అధికారులు మాత్రం పట్టించుకోలేదు.

హైడ్రా కమిషనర్ రంగనాథ్ సీరియస్..

మూడు నెలల క్రితం ఫాక్స్‌సాగర్ చెరువు పరిశీలనకు వచ్చిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువు నీటిని ఎందుకు తోడేస్తున్నారంటూ అధికారులపై సీరియస్ అయ్యారు. అక్కడే ఉన్న ఇరిగేషన్ ఏఈ, డీఈలు మౌనంగా ఉండిపోయారు. వెంటనే బయటకు తోడేస్తున్న నీటిని ఆపాలంటూ ఆయన హుకుం జారీ చేసినప్పటికీ అధికారులు మాత్రం తమ పని తాము కానిచ్చేస్తున్నారు.

చెరువు కింద జరగబోయే నిర్మాణల కోసమే నీటిని తోడేస్తున్నారా?

ఇప్పటికే ఫాక్స్‌సాగర్ చెరువు కింద గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణాలు జోరుగా కొనసాగుతుండగా మరికొన్ని నిర్మాణాల కోసం వెంచర్లు రెడీగా ఉన్నాయి. ఒకవేళ ఫాక్స్‌సాగర్ చెరువులో నీరు నిండితే నిర్మాణాల కోసం గుంతలు తీస్తే గుంతల్లోకి నీరు చేరే అవకాశం లేకపోలేదు. అందుకే అధికారులు చెరువు నీటిని యథేచ్ఛగా తోడేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. చెరువు కింది స్థలాలను కొంతమంది రాజకీయ నాయకులు కొనుగోలు చేసి నిర్మాణాల కోసం వేచి చూస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.



మత్తడి గేట్లు ఎత్తి బయటకు పారిస్తున్న నీరు



మురుగు నీటి కాలువలో కలుస్తున్న చెరువు నీరు